www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

కే టి పి ఎస్ లో అధికార పరిధి వివాదం..



6 లో..

బీటీపీఎస్ కార్మికుల సీనియార్టీ జాబితాను వచ్చే నెలలో ప్రకటిస్తాం!



6 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 292, శుక్రవారం 20-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

ప్రతి కుటుంబానికి

5 లక్షల జీవిత బీమా..



- *ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం*
- *నవంబర్ 26 నుంచి కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరల పంపిణీ*
- *సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్ మోహన్ పేరు.. సీఎం ప్రకటన*
- *రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం..*
- *పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు*

సిద్దిపేట:నవంబర్ 19 :

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రజాపాలన-ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ఈ పథకాన్ని ప్రారంభించారు. అలాగే నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం నుంచి రాష్ట్రంలోని కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.ముస్తాబాద్ చౌరస్తా నుంచి ప్రజలతో కలిసి సుమారు రెండు కిలోమీటర్ల మేర పాదయాత్రగా సభా ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..సిద్దిపేట శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన మదన్ మోహన్ తొలి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్ మోహన్ మెడికల్ కాలేజీగా పేరు పెట్టనున్నట్లు ప్రకటించారు.ఇందుకు సంబంధించిన ఆదేశాలు వెంటనే జారీ చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదేశించారు.

మల్లన్నసాగర్ ప్రాజెక్టు

మిగతా 2 లో..

కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు..

అవినీతి పాలన

- *సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు*
- *పెన్షన్లలో 4.70 లక్షల కోతలు.. రూ.4 వేల హామీ ఏమైంది?*
- *కాంగ్రెస్ నేతలు తిన్న అవినీతి సొమ్మును కక్కిస్తాం: కేటీఆర్*

హైదరాబాద్, నవంబర్ 19

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, అవినీతి పాలన అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి



చెందిన ఎమ్మెల్యేలే ప్రభుత్వంలో అవినీతి జరుగుతోందని బహిరంగంగా మాట్లాడుతున్నారని, వారి వ్యాఖ్యలతో పాలనలోని లోపాలు బయటపడుతున్నాయని అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పనులు జరగాలంటే పర్సంటేజీలు ఇవ్వాల్సి వస్తోందని చెబుతుండగా, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై రూ.5 లక్షల కోట్ల దోపిడీ, టెండర్లలో అవినీతి, కుంభకోణాలకు సంబంధించిన ఆరోపణలు చేస్తున్నారని గుర్తుచేశారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులే ప్రభుత పనితీరును ప్రశ్నిస్తున్న పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రభుత్వం నుంచి నియోజకవర్గాలకు నిధులు రావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. నిధుల కోసం ప్రపంబ్యాంకుకు అర్జీలు పెట్టుకునే పరిస్థితి వచ్చిదని ఎద్దేవా చేశారు. తమ నియోజకవర్గాలో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని, అందుబాటులో ఉన్న నిధులన్నీ కొడంల్‌కు తరలిస్తున్నారని యెన్నం శ్రీనివాస్ రెడ్డి గతంలో ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తాము కేవలం పెళ్లిళు చావులకు మాత్రమే పరిమితమయ్యామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై ఆ పార్టీ నేతలే గళం విప్పుతున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని ఆరోపణలు,

మిగతా 2 లో..



మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి నాగార్జున మద్దతు

- *'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్'లో పాల్గొననున్న నటుడు*
- *నాగార్జునను కలిసి ఆహ్వానించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి*
- *నవంబర్ 25 నుంచి 27 వరకు ప్రత్యేక పాదయాత్ర*
- *అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు అవగాహన కార్యక్రమం*

హైదరాబాద్, నవంబర్ 19

:మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా చేపడుతున్న అవగాహన ఉద్యమంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున భాగస్వామి కానున్నారు. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో పాల్గొని తన మద్దతు అందించేందుకు ఆయన అంగీకరించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో నాగార్జునను కలిసిన కిషన్ రెడ్డి, ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం చేపడుతున్న ఈ సామూహిక ఉద్యమానికి నాగార్జున మద్దతు ప్రకటించడం సంతోషంగా ఉందని తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన 'వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువత' పిలుపు స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజంలో వాటి దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన

మిగతా 2 లో..



సాగు బాగుంటేనే సుభిక్షమైన

తెలంగాణ సాధ్యం

- *ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం*
- *వ్యవసాయ రంగ ప్రముఖులకు ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాలు*
- *శాస్త్రవేత్తలు, పాత్రికేయుడు, రైతులకు అవార్డుల ప్రదానం*
- *ఇందిరా గాంధీ వ్యవసాయ సేవలపై పుస్తకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి*

హైదరాబాద్, నవంబర్ 19

సాగు బాగుంటేనే సుభిక్షమైన తెలంగాణ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. సాగునీటి వసతులు మెరుగుపడితే రైతులకు భరోసా కలగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కూడా దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

వ్యవసాయ రంగంలో విశేష సేవలు అందించిన ప్రముఖులకు ముఖ్యమంత్రి తన నివాసంలో ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాలను ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎంపిక చేసిన శాస్త్రవేత్తలు, పాత్రికేయుడు, రైతులు ఈ అవార్డులను అందుకున్నారు.వ్యవసాయ రంగంలో విభిన్న విభాగాల ద్వారా సేవలందించిన వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో ఈ పురస్కారాలను అందజేశారు. పురస్కారాలకు ఎంపికైన డాక్టర్ ఎం. సుగుణాకర్ రెడ్డి, డాక్టర్ ఎస్.డి. శిఖామణి వ్యవసాయ శాస్త్రవేత్తల విభాగంలో అవార్డులు అందుకున్నారు. పాత్రికేయ రంగం నుంచి ఆర్. దిలీప్ రెడ్డికి పురస్కారం లభించింది. రైతుల విభాగంలో గిరిజన రైతు లోనావత్ శాంతా బాయి, సేంద్రియ రైతు కె. లావణ్య అవార్డులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వీకరించారు. వ్యవసాయానికి తమ తమ రంగాల్లో అందించిన సేవలకు గుర్తింపుగా వీరిని ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ వ్యవసాయ రంగ అభివృద్ధికి అందించిన సహకారం, ఆమె హయాంలో సాగు రంగంలో చోటుచేసుకున్న మార్పులపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దేశ వ్యవసాయ ప్రస్థానంలో ఇందిరా గాంధీ పాలనాకాలంలో చోటుచేసుకున్న అభివృద్ధి, రైతులకు అందించిన ప్రోత్సాహాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు.

రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, రైతులను ఒకే వేదికపై గౌరవించడం ద్వారా వ్యవసాయ రంగానికి వారి సేవలను గుర్తించినట్లయింది. వ్యవసాయ పరిశోధనలు, ఆధునిక సాగు విధానాలు, సేంద్రియ వ్యవసాయం వంటి విభిన్న రంగాల్లో సేవలందిస్తున్న వారిని ప్రోత్సహించడం ఈ పురస్కారాల

మిగతా 2 లో..

కృష్ణా జలాల వాటాలో

రాజీ పడే ప్రసక్తే లేదు

- *తెలంగాణ ప్రయోజనాల కోసం 70 శాతం వాటా కోరుతున్నాం: మహేశ్‌కుమార్ గౌడ్*
- *సాగర్ నుంచి నీటి తరలింపును అడ్డుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమే*
- *బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శ*
- *భూములకే కాదు.. నీటి హక్కులపైనా రాజకీయ పోరాటం*

హైదరాబాద్, నవంబర్ 19

తెలంగాణకు కృష్ణా జలాల కేటాయింపుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.రాష్ట్రానికి 70 శాతం నీటి వాటా సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడుతోందని తెలిపారు. నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించే ప్రయత్నాలను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు తమ పాలనలో జరిగిన తప్పిదాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని ఆరోపించారు. కేటీఆర్ కొత్త రాజకీయ నాటకానికి తెరతీశారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అప్పట్లో 36 శాతం నీటి వాటా సరిపోతుందని కేసీఆర్ అంగీకరించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 70 శాతం వాటా కోసం పట్టుబడుతోందని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో ఆంధ్రప్రదేశ్ 4,464 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోగా, తెలంగాణకు 1,993 టీఎంసీలే దక్కాయని పేర్కొన్నారు. గతంలో అంగీకరించిన నీటి వాటా, ప్రస్తుత ప్రభుత్వ డిమాండ్ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపు అంశంపై కేంద్రానికి, కృష్ణా



నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు తెలిపిందని ఆయన వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో నూ కేంద్రానికి లేఖలు రాశామని, తెలంగాణ అభ్యంతరాల కారణంగా ఆ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. అవసరమైతే రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. డ్యామ్‌పై కేంద్ర

మిగతా 2 లో..

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
శుక్రవారం
20 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా..

(మొదటి పేజీ తరువాయి)

ముంపునకు గురైన 14 గ్రామాల నిజమైన బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరలోనే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను గుర్తించిన అనంతరం నష్టపరిహారం అందిస్తామని వెల్లడించారు.

తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, రాష్ట్రానికి రావాల్సిన ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని స్పష్టం చేశారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ, సీతారామసాగర్ వంటి ప్రాజెక్టులను గత పదేళ్లలోనే పూర్తి చేసి ఉంటే నేడు నీటి సమస్యలు ఎదురయ్యేవి కాదని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రారంభించిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని తమ ప్రభుత్వం రద్దు చేయలేదని ముఖ్యమంత్రి తెలిపారు. వాటిని మరింత మెరుగ్గా అమలు చేస్తూనే కొత్త సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని చెప్పారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, కొత్తగా ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను వివరించారు.రైతుల సంక్షేమం కోసం రుణమాఫీతో పాటు మొత్తం రూ.1.78 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు వెల్లడించారు.

రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

సిద్దిపేట జిల్లాలో రూ.544.11 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తయిన మరికొన్ని పనులను ప్రారంభించారు. విద్య, విద్యుత్, రెవెన్యూ, ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లాలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో రూ.15.44 కోట్లతో అదనపు తరగతి గదులు, రూ.13.50 కోట్లతో ఆరు తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. చిన్నకోడూరు మండలంలో రూ.7.50 కోట్లు, దౌల్తాబాద్ మండలంలో రూ.7.80 కోట్లతో తెలంగాణ పబ్లిక్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. జనగామ నియోజకవర్గంలో రూ.6.89 కోట్లతో మూడు విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు.

పూర్తయిన పనులు ప్రారంభం

సిద్దిపేట జిల్లాలో రూ.54.67 కోట్లతో నిర్మించిన 14 విద్యుత్ ఉపకేంద్రాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రూ.14.35 కోట్లతో నిర్మించిన వసతి సత్రం, రూ.12 కోట్లతో నిర్మించిన క్యూల సముదాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ.6.50 కోట్లతో నిర్మించిన 53 గ్రామ మహిళా సంఘాల భవనాలు, రాయపోల్ మండలంలో రూ.3.87 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం, గజ్వేల్‌లో రూ.1.59 కోట్లతో నిర్మించిన విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పి. సుదర్శన్ రెడ్డి, వి. హనుమంతరావు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాగు బాగుంటేనే సుభిక్షమైన తెలంగాణ సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. అవార్డు గ్రహీతలు తమ రంగాల్లో కొనసాగిస్తున్న కృషికి ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు కె.వి.ఎన్. రెడ్డి, ఎం. భవాని రెడ్డితో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగానికి సేవలందించిన ప్రముఖులను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలో సాగునీటి వసతుల విస్తరణతో పాటు రైతుల సంక్షేమానికి సంబంధించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి నాగార్జున మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

కల్పించడం ఈ ఉద్యమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలకే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఈ సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 25 నుంచి 27వ తేదీ వరకు 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు పాదయాత్ర చేపట్టి మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో యువత, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. ప్రజల భాగస్వామ్యం పెరిగితే మాదకద్రవ్యాల సమస్యపై సమాజంలో మరింత చైతన్యం తీసుకురావచ్చని భావిస్తున్నారు.

ఈ ఉద్యమంలో నాగార్జున పాల్గొననుండటం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా యువతపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిర్వాహకులు ఆశిస్తున్నారు. నాగార్జున తన మద్దతుతో మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తోడ్పడతారని, యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఈ వేదిక ద్వారా పిలుపునివ్వనున్నారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు, ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. 'నషా ముక్త్ భారత్' లక్ష్య సాధనలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పాదయాత్రకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. నవంబర్ 25 నుంచి 27 వరకు జరిగే కార్యక్రమంలో భాగస్వాములై మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి చేయూతనివ్వాలని కోరారు. యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా చేపడుతున్న ఈ ఉద్యమం ద్వారా హైదరాబాద్‌లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న కేటీఆర్

- **కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో ప్రత్యేక పూజలు**
- **మహా పడిపూజ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**
- **భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అయ్యప్ప స్వామి ఆరాధన**



హైదరాబాద్, నవంబర్ 19 : కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైన ఆయన అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో భక్తి వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆరాధనలు చేపట్టారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమానికి అనుగుణంగా ఆధ్యాత్మిక ఏర్పాట్లు చేశారు.కార్యక్రమానికి వచ్చిన కేటీఆర్‌కు నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పూజా కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వామికి మొక్కులు సమర్పించారు. మహా పడిపూజ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ఆరాధనల్లో భాగస్వామ్యమయ్యారు. ఈ కార్యక్రమం భక్తుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా కొనసాగింది.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు పార్టీ నాయకులు పూజల్లో పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందారు. నాయకుల రాకతో కార్యక్రమ ప్రాంగణంలో సందడి నెలకొంది. భక్తులు, పార్టీ శ్రేణులు ఈ ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి మహా పడిపూజ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికతకు వేదికగా నిలిచింది. రాజకీయ కార్యక్రమాలకు భిన్నంగా పార్టీ నాయకులు ఒకచోట చేరి పూజల్లో పాల్గొనడం ప్రత్యేకతను సంతరించుకుంది. కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు..

అవినీతి పాలన

(మొదటి పేజీ తరువాయి)

కుంభకోణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ల విషయంలో ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 44 లక్షల 70 వేల పెన్షన్లు ఉండేవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాది 1.50 లక్షలు, రెండో ఏడాది మరో 1.50 లక్షలు, మూడో ఏడాది 1.70 లక్షల పెన్షన్లు తొలగించిందని, మొత్తంగా 4.70 లక్షల పెన్షన్లకు కోత పెట్టిందని విమర్శించారు. మరోవైపు కొత్తగా 4.63 లక్షల పెన్షన్లు మాత్రమే మంజూరు చేసిందని, తొలగించిన వాటితో పోలిస్తే కొత్తగా ఇచ్చినవి ఏడు వేల తక్కువగా ఉన్నాయని వివరించారు. పెన్షన్లు పెంచామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, వాస్తవంగా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించిందని ఆరోపించారు. పెన్షన్ల బడ్జెట్ కూడా పెరగలేదని, ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియకుండా ప్రభుత్వం ప్రచారానికి ప్రాధాన్యమిస్తోందని విమర్శించారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. నవంబర్‌లో రూ.2 వేలు, డిసెంబర్ నుంచి రూ.4 వేలు ఇస్తామని ప్రకటించినప్పటికీ, మూడు డిసెంబర్లు గడిచినా ఇప్పటికీ రూ.2 వేలే అందుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న మొత్తం కూడా గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసినదేనని, కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని ఒక్క రూపాయి కూడా పెంచలేదని మండిపడ్డారు.వృద్ధులు, వికలాంగులు ఆత్మ గౌరవంతో జీవించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం పెన్షన్‌ను రూ.200 నుంచి రూ.2 వేలకు పెంచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి, భట్టి విక్రమార్క అఫిడవిట్‌తో హనుమాన్ ఆలయంలో ప్రమాణం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. గ్యారంటీ కార్డులను క్రెడిట్ కార్డుల్లా భద్రంగా పెట్టుకోవాలని చెప్పిన నాయకులు, హామీలను అమలు చేయలేకపోయారని విమర్శించారు.

అవినీతి సొమ్ముతో ఓటుకు రూ.15 వేలు ఇచ్చి ప్రజలను కొనుగోలు చేయవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. డబ్బులు పంచితే ప్రజలు తనకే ఓటు వేస్తారనే భ్రమలో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఏడాది తర్వాత వచ్చేది గులాబీ జెండానేనని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకులు తిన్న అవినీతి సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు. అవినీతికి పాల్పడిన వారిలో ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఢిల్లీ నాయకులు రాష్ట్రానికి వచ్చిన ప్పుడల్లా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు.ప్రియాంక గాంధీ వచ్చినప్పుడు ముఖ్యమంత్రి వ్యవహరించిన తీరును, రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో బైక్‌పై వెళ్తున్న సమయంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామి వెనుక పరుగులు తీసిన ఘటనను ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. బీజేపీలోనూ ఢిల్లీ నాయకుల పట్ల ఇదే ధోరణి కనిపిస్తోందని, అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు రాష్ట్ర నాయకులు వ్యవహరించిన తీరును ప్రశ్నించారు.

ఇదిలా ఉండగా, భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ప్రాంతంలో కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం మున్సిపాలిటీ, జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ కాలేజీని తీసుకొచ్చామని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో రాష్ట్రంలో ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటి సంఖ్యను 32కు పెంచామని, తద్వారా వేలాది మంది విద్యార్థులకు వైద్య విద్య అభ్యసించే అవకాశం కల్పించామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణ ప్రయోజనాల కోసం ఢిల్లీ పెద్దలను ప్రశ్నించకుండా వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఢిల్లీకి వెళ్తున్నాయని, అధిష్ఠానానికి చెల్లించాల్సిన ఈఎంఐలు కట్టకపోతే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి పోతుందంటూ వ్యాఖ్యానించారు. అందుకే ఆయనను రెగ్యులర్ ముఖ్యమంత్రి కాకుండా రెన్యువల్ ముఖ్యమంత్రి అని పిలుస్తున్నానని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతుందని, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

కృష్ణా జలాల వాటాలో రాజీ పడే ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)



బలగాల పర్యవేక్షణ, కేఆర్ఎంబీ నియంత్రణ వంటి అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం వెనుక బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ అవగాహన ఉందని ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కృష్ణా బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఎస్ఎల్బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు పక్కన పెట్టారని, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా సాధించలేకపోయారని అన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్ ఆధునికీకరణ, డిండి వంటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చి ఉంటే రాష్ట్రంలో సాగునీటి విస్తీర్ణం మరింత పెరిగేదని అభిప్రాయపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.1.84 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసినప్పటికీ ఆశించిన ప్రయోజనాలు అందలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నాయని, జాతీయ స్థాయి నిపుణుల పరిశీలనలోనూ ఈ అంశాలు వెల్లడయ్యాయని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది కేసీఆర్ ప్రభుత్వమేనని విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి, షాదీ ముబారక్ పథకాలకింద పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించిందని తెలిపారు. నెహ్రూ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయని, నాగార్జున సాగర్ వంటి ప్రాజెక్టులు వ్యవసాయ రంగానికి కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని విమర్శలు, ప్రకటనలు చేసినా ప్రజలకు ప్రయోజనం ఉండదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని పునరుద్ఘాటించారు. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా సాధించేందుకు న్యాయపరంగా, పరిపాలనాపరంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. పార్టీ నూతన ఇన్‌ఛార్జి సందీప్ నిబద్ధత కలిగిన నాయకుడని అభివర్ణించారు. నీటి అంశాన్ని రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా రాష్ట్ర ప్రయోజనాల దృష్టితో చూడాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు.

హెల్త్ ఇన్సూరెన్సతో ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణ

- కరోనా తరువాత హెల్త్ పాలసీలకు పెరిగిన ప్రాధాన్యత.
- కేర్ ఏరియా మేనేజర్ గద్దగూటి రేవతి.

ఖమ్మం , నవంబర్ 19(భద్రాద్రి న్యూస్): హెల్త్ పాలసీలతో అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు సంపూర్ణ రక్షణ అందిస్తున్నాయని కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ మేనేజర్ గద్దగూటి రేవతి తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు ఆరోగ్య పరిరక్షణకు వజ్రాయుధంలా దోహదపడుతున్నాయని తెలిపారు. కరోనా తర్వాత సమాజంలో హెల్త్ పాలసీలపై అనూహ్యంగా ప్రాధాన్యత పెరిగిందని పేర్కొన్నారు. ముందస్తుగా హెల్త్ పాలసీలో చేరిన వారికి అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు అన్ని ఎన్ పానెల్ ఆస్పత్రులలో ఉచితంగా ఒక్క పైసా ఖర్చు కాకుండా వైద్యం చేయించుకునే సువర్ణ అవకాశం లభిస్తుందని తెలియజేశారు. వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా హెల్త్ ఇన్సూరెన్సలు చేయించుకున్న వారికి తమతో పాటు కుటుంబ సభ్యులందరికీ ఆధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంటున్నాయి అన్నారు. భర్త, భార్య, ఇద్దరు పిల్లలకు కలిపి ముందుస్తుగా వారి వయసును బట్టి హెల్త్ పాలసీ సంవత్సరానికి 15వేల రూపాయల నుంచి 50వేల రూపాయల వరకు హెల్త్ పాలసీలు అందుబాటులో ఉంటున్నాయని పేర్కొన్నారు. ఈ హెల్త్ పాలసీల ద్వారా అత్యాధునిక వైద్య సౌకర్యాలు ఉచితంగా అందుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. సాధారణ అనారోగ్యంతో పాటు గుండె ఆపరేషన్లు, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు, కంటి ఆపరేషన్లు, ఐవిఎఫ్ వైద్యం, ఆర్థోపెడిక్ వైద్యం తదితర ఆత్యాధునిక వైద్య సౌకర్యాలను హెల్త్ పాలసీలతో అందుబాటులో ఉన్నాయని రేవతి తెలియజేశారు.తమ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా అందరికీ అందుబాటులో ఉండే హెల్త్ పాలసీలన ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని రేవతి కోరారు. హెల్త్ పాలసీలకు సంబంధించిన ఏవైనా అనుమానాలు ఉంటే



అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి 9959925756 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ మేనేజర్ గద్దగూటి రేవతి కోరారు.

సీపీఎం సీనియర్ నేత భూక్య బాబు భౌతికకాయం మెడికల్ కాలేజీకి అప్పగింత

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెంలో సీపీఎం సీనియర్ నేత, ప్రజానాట్యమండలి కళాకారుడు భూక్య బాబు (బాబన్న) సంతాప సభలో పలువురు నాయకులు నివాళులు అర్పించారు. బాబన్న జీవితం మనకు ఆదర్శం కావాలని, ఎర్రజెండా స్థాపన కోసం జరిగే ప్రజా పోరాటాలు, వర్గ పోరాటాలు, సామాజిక ఉద్యమాలకు మరింత పదును పెట్టి ముందుకు తీసుకుపోవడమే(భూక్య బాబు) బాబన్నకు మనమిచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం సీనియర్ నేత పి. రాజారావు, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ తండ్రి (భూక్యా బాబు) బాబన్న (73) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆసుపత్రిలో బుధవారం ఉదయం మృతి చెందారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని హనుమాన్ బస్తీలో గల భూక్య బాబన్న ఇంట్లో ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. సిపిఎం జిల్లా కమిటీ, ఇతర నాయకులు, సిపిఎం అనుబంధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు, ఇతర పార్టీ నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు వక్తలు మాట్లాడారు. కొత్తగూడెం సిపిఎం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ ఎర్రజెండా స్థాపన కోసం జరిగే ప్రజా పోరాటాలు, వర్గ పోరాటాలు, సామాజిక ఉద్యమాలకు మరింత పదును పెట్టి ముందుకు తీసుకుపోవడమే మనము బాబన్నకు వచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహిస్తూనే కార్మికులకు ఎదురయ్యే సమస్యల కోసం పోరాటాలు నిర్వహించడంలో భూక్యాబాబు ముందు బాగాన ఉన్నారని తెలిపారు. అదే విధంగా సామాజిక చైతన్యం కోసం ప్రజానాట్యమండలి కళాకారులుగా అనేక కళారూపాల ప్రదర్శించి ప్రజల్లో చైతన్యాన్ని నింపారని తెలిపారు. ఆయన ఆశయం సాధించడం అంటే సమాజం ఎదుర్కొంటున్న సవాళ్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతిఘటిస్తూ ప్రతి ప్రజా ఉద్యమం నిర్వహించడం అనేది పౌర సమాజంలో ఉన్న ప్రధాన కర్తవ్యం. ఆ కర్తవ్యాన్ని కమ్యూనిస్టుగా, మార్క్సిస్టు ముద్దుబిడ్డగా మన అమర జీవులు ఆశించిన లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోవాలి...ఆ రకంగా బాబన్న వదిలి వెళ్ళిన వారి ఆశయాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. 100 ఉపన్యాసాలు కంటే ఒక కళా ప్రదర్శన గొప్ప చైతన్యాన్ని ఇస్తుందని బాబన్న నిరూపించారని తెలిపారు. గొంగళి వేసుకొని కళా ప్రదర్శన ఇచ్చి లక్షలాది మందిని ప్రభావితం చేసిన వ్యక్తి భూక్యా బాబు అని తెలిపారు. ఆయన జీవితం నేటితరం యువతకు ఆదర్శం కావాలని అన్నారు. తాను ఎర్రజెండా ముద్దుబిడ్డగా ఉండడమే కాకుండా అది ఆచరణలో నిరూపించారని తెలిపారు. తన కుటుంబం యావత్తు మొత్తం ప్రజా ఉద్యమాల్లో ఉంచారని, సిపిఎం అనుబంధ ప్రజా సంఘాలలో పనిచేస్తున్నారని తెలిపారు. బాబన్న ఆచరణ వాది అని, మాటల మనిషి కాదని... చేతల మనిషని నిరూపించిన బాబన్న జీవితం మనకి ఆదర్శం కావాలని తెలిపారు. అలాంటి గొప్ప కళాకారున్ని, విప్లవకారున్ని సమాజం కోల్పోయిందన్నారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకువెళ్లాలని పిలుపు నిచ్చారు. బాబన్న మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య బాబన్న మృతి ప్రజా ఉద్యమాలకు,ప్రజా కళాకారులకు తీరని లోటని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు.సింగరేణి ఉద్యోగం చేసుకుంటూ ఉద్యోగం కంటే ఉద్యమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిన బాబన్న స్ఫూర్తితోనే ఆనాడు విద్యార్థి ఉద్యమంలో పనిచేసి నేటి కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా ఎదిగామని తెలిపారు. బాబన్న మరణ వార్త తెలుసుకొని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఎం సాయిబాబు,వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్,బండారు రవికుమార్ ప్రజాకవి జయరాజు,కొండపల్లి పావన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతు సంఘం నాయకులు అన్నవరపు సత్యనారాయణ,బొంతు రాంబాబు,వంశీ,మాదినేని రమేష్,కున్సోత్ ధర్మ , కొక్కెరపాటి పుల్లయ్య తదితరులు సంతాపం ప్రకటించారు.



బాబన్న ఆశయాన్ని కొనసాగిస్తాం – సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాభీర్ పాషా

బాబన్న ఆశయాన్ని కొనసాగిస్తూ వామపక్షాలు ముందుకు సాగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా తెలిపారు. తుదిశ్వాస వరకు ఎర్రజెండా బాటలో ప్రయాణం చేసి తన కుటుంబాన్ని కూడా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి అంకితం చేసిన బాబును నేటి తరానికి స్ఫూర్తియని కొనియాడారు.

ఈ సంతాప సభలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మందా నరసింహారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి, ప్రజా నాట్య మండలి నాయకులు కె దేవేంద్ర, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం, టిజెఎస్ నాయకులు మల్లెల రామనాథం,సిపిఐ ఎంఎల్ నాయకులు సురేందర్, బిఆర్ఎస్ నాయకులు తొగరు రాజశేఖర్ టిఆర్ఎస్ నాయకులు డి వీరన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య, ఎం జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ ఏ నభి దొడ్డా రవి వీర్ల రమేష్ యాస నరేష్ పద్మ సీనియర్ నాయకులు ఎం ఎస్ ప్రకాష్ రాజారావు సత్య నారాయణ నాయకులు కే సదానందం, లక్ష్మీ నారాయణ,ఎస్ లక్ష్మి నందిపాటి రమేష్ జునుమాల నగేష్ బాబన్న కుటుంబ సభ్యులు, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బాబు పార్థివదేహానికి మేయర్ మూడు గణేష్ నివాళులు అర్పించారు.

సిరంజిల కొరతతో పేదలకు అందని వైద్యం



కామేపల్లి, నవంబర్19 (భద్రాద్రిన్యూస్):- కామేపల్లి మండలం కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్సీ)లో సిరంజిలు లేకపోవడంతో రోగులకు ఇంజెక్షన్లు వేయ కుండా కేవలం మాత్రలు మాత్రమే ఇచ్చి పంపిస్తున్నారని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా శ్రీను నాయక్,మండల అధ్యక్షుడు జరపల రామారావు ఆరోపించారు. హరిజన,గిరిజన, పేద ప్రజలు నివసించే ఈ ఏజెన్సీ ప్రాంతంలో సూదులు వేయక పోవడంతో వ్యాధులు తగ్గక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా తర్వాత ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడటం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేసి ఆసుపత్రిలో సిరంజిలు, మందులు సరఫరా చేసి అందుబాటులోకి తేవాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

ఉక్కు మహిళ' ఇందిరా గాంధీకి ఘన నివాళి



కామేపల్లి, నవంబరు19 (భద్రాద్రిన్యూస్):- దేశ తొలి మహిళా ప్రధాని,దివంగత ఇందిరా గాంధీ జయంతి వేడుకలను గురువారం– కామేపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు ఆధ్వర్యంలో నాయకులు ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ.. మహిళల విద్య, ఆత్మవిశ్వాసమే దేశ ప్రగతికి సోపానాలని ఇందిరమ్మ భావించారన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేందుకు, దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని ఆమె ఇచ్చిన సందేశం నేటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కష్టకాలంలోనూ దేశాన్ని సమర్థంగా నడిపించినందునే ఆమెకు'ఐరన్ లేడీ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు దక్కిందన్నారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా కార్యదర్శి ఫతే మహమ్మద్, ఏఎంసీ డైరెక్టర్ గబ్రు నాయక్, జిల్లా నాయకుడు తోటకూరి శివయ్య,సర్పంచ్ గుగులోతు భాష, ఉప సర్పంచ్ నాగమణి,మాజీ ఎంపీటీసీ రాందాస్ నాయక్, మాజీ సర్పంచ్ కొర్ర ధ్వలి,అర్జున తిరుపతయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు శోధనపు కోటయ్య, సీతారాములు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గొర్రెకు క్లిష్టమైన ప్రసవం విజయవంతం.. సురక్షితంగా పిల్ల జననం

-- మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి నాగులు



కామేపల్లి, నవంబర్19 (భద్రాద్రిన్యూస్):- కామేపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక పశు వైద్యశాలలో గొర్రెకు ఎదురైన క్లిష్టమైన ప్రసవ సమస్యను మండల పశువైద్య అధికారి డాక్టర్ నాగులు బృందం విజయవంతంగా పరిష్కరించి సురక్షిత ప్రసవం చేసింది. గర్భాశయ సంకోచాలు సరిగా లేకపోవడం,పిల్ల తల క్రిందికి ఛాతీ వైపు వంగిపోవడం వల్ల ప్రసవం కష్టతరంగా మారిందని డాక్టర్ నాగులు వివరించారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రత్యేక వైద్య పద్ధతులు,తగిన జాగ్రత్తలు పాటిస్తూ గొర్రెకు ఇబ్బంది కలగకుండా సురక్షితంగా ప్రసవం చేయించినట్లు తెలిపారు.ఈ చికిత్స,ప్రసవ ప్రక్రియ విజయవంతం కావడంలో సిబ్బంది శిరీష, వంశీ,శరత్ కీలకంగా వ్యవహరించి సహకరించారు అని వారు తెలిపారు

పండితాపురంలో లో–వోల్టేజీ కష్టాలకు చెక్.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలకు ఊరట



కామేపల్లి, నవంబరు19 (భద్రాద్రిన్యూస్):- పండితాపురం గ్రామంలోని మెయిన్ రోడ్డు, సంత ప్రాంతంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న లో–వోల్టేజీ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. తక్కువ వోల్టేజీ కారణంగా గృహోపకరణాలు పనిచేయక, వ్యాపారాలు, రోజువారీ పనులకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ?ప్రజల సమస్యను గుర్తించిన ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారుల చొరవతో ఆ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ డీఈ రామారావు, ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, వార్డు మెంబర్ ధనియాకుల మాధవరావుల సమక్షంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేశారు.ఇకపై సంత,మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో స్థిరమైన విద్యుత్ సరఫరా అందుతుందని అధికారులు తెలిపారు.తమ కష్టాలు తీరడంపై స్థానిక ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నిఖార్సయిన నాయకుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కామేపల్లి, నవంబరు 19 (భద్రాద్రిన్యూస్) : కామేపల్లి మండల పరిధిలోని పాతలింగాల గ్రామ వాస్తవ్యులు తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం స్వగ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించి,కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.తాతల కాలం నుంచి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, పదవులు ఉన్నా లేకున్నా,ఎన్ని ఆటంకాలు ఎదురైనా పార్టీ మారకుండా కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న నిస్వార్థపరుడు డైనమిక్ లీడర్ గోపాల్‌రెడ్డి అని జిల్లా జనరల్ సెక్రటరీ గింజల నర్సిరెడ్డి,మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథ్‌రెడ్డి, సర్పంచ్ కిన్నెర సుజాత,కిన్నెర నాగయ్య,ఉప సర్పంచ్ రాము, నాయకులు విశ్వనాథం,శేఖర్, యువజన నాయకులు గోపి, వినోద్,చందు, పాపయ్య తదితరులు పాల్గొని.జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుతూ వారి సేవలను మరొకసారి గుర్తు చేస్తూ శుభాకాంక్షలు తెలుపుతూ కొనియాడారు.

తాళ్లగూడెం 'మార్త హోమ్'లో అనాథలకు పండ్లు,బ్రెడ్ పంపిణీ

కామేపల్లి నవంబర్ 19 (భద్రాద్రిన్యూస్):- భారత దేశపు మొట్టమొదటి మహిళా ప్రధాన మంత్రి,ఉక్కు మహిళగా పేరొందిన దివంగత నేత మన మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతి అలాగే రాంరెడ్డి గోపాల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని తాళ్లగూడెంలోని 'మార్త హోమ్' అనాథా శ్రమంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని అనాథ పిల్లలకు నాయకులు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి వారితో కాసేపు ఆప్యాయంగా గడిపారు.దేశానికి ఇందిరా గాంధీ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకుంటూ, పేదలు అనాథలకు అండగా నిలవడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ బిఎల్ఓ,మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు పుచ్చకాయల అప్పారావు,బీసీ సెల్ మండల నాయకులు సింగం వెంకన్న, స్థానిక గ్రామీణ వైద్యులు దార సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow : @bhadradrinews
శుక్రవారం
20 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

ప్రజారోగ్య పరిరక్షణకు రషీద్ ఖాన్ దాతృత్వపు చేయూత

- పేరుపల్లి హెల్త్ సెంటర్‌కు ఆటోమేటిక్ బీపీ మెషిన్ విరాళం.. అభినందించిన సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం



కారేపల్లి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్ -- రాములు): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో పేరుపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ రషీద్ ఖాన్ తన ఉదారతను చాటుకున్నారు. సింగరేణి మండలం పేరుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని హెల్త్ సెంటర్‌కు ఆటోమేటిక్ బీపీ మెషిన్‌ను విరాళంగా అందజేసి ప్రజారోగ్య పరిరక్షణలో తనవంతు బాధ్యతను నిర్వర్తించారు. గ్రామ సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం చేతుల మీదుగా ఈ వైద్య పరికరాన్ని హెల్త్ సెంటర్‌కు అందజేశారు. ఈ యంత్రం అందుబాటులోకి రావడంతో వైద్య కేంద్రానికి వచ్చే రోగులకు రక్తపోటు పరీక్షలు మరింత సులభంగా, వేగంగా నిర్వహించేందుకు అవకాశం కలగనుంది. ముఖ్యంగా వృద్ధులు, రక్తపోటు సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ పరికరం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ప్రభుత్వ వైద్య కేంద్రాలకు అవసరమైన పరికరాలను దాతలు స్వచ్ఛందంగా అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడేలా విలువైన వైద్య పరికరాన్ని అందించిన మహమ్మద్ రషీద్ ఖాన్‌ను సర్పంచ్, ప్రజాప్రతినిధులు అభినందించారు. గ్రామాభివృద్ధితో పాటు ప్రజారోగ్యానికి దాతలు అందించే సహకారం సమాజానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మల్లెల పావని, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆశయాలే కాంగ్రెస్ పార్టీకి స్ఫూర్తి

- మేకలతండాలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు.. సీనియర్ నాయకుడు భూక్యా రమేష్ (ఎల్ఐసీ) ఆధ్వర్యంలో నివాళులు



కారేపల్లి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్ -- రాములు): భారత తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలు సింగరేణి మండలం మేకలతండాలో ఘనంగా నిర్వహించారు. మేకలతండా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భూక్యా రమేష్ (ఎల్ఐసీ), దుబ్బతండా గ్రామపంచాయతీ గ్రామశాఖ అధ్యక్షుడు గుగులోత్ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భూక్యా రమేష్ మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, పేదల సంక్షేమం కోసం ఇందిరాగాంధీ అందించిన సేవలు భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా 'గరీబీ హఠావో' నినాదంతో ఆమె చేపట్టిన కార్యక్రమాలు దేశ ప్రజలపై చెరగని ముద్ర వేశాయని గుర్తుచేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బావుసింగ్, సాగర్, శంకర్, రాంబాబు, దుప్ సింగ్, ఈశ్వర్, హనుమా, కిషన్, శ్రీరామ్, సీతారామ్, విజయ్ కుమార్, హతీరం, అనీల్, సోమ్లా, దేవుసింగ్, భజ్జు, మాజీ ఎంపీటీసీ రమేష్, మోహన్, వార్డు సభ్యులు వీరేందర్, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి కట్టడికి ప్రత్యేక వైద్య శిబిరం

- ఏకన్నగూడెంలో 32 మందికి వైద్య పరీక్షలు.. 22 మందికి టీబీ స్క్రీనింగ్
- వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యం





వెంకటాపురం, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్) : క్షయ వ్యాధి (టీబీ) నిర్మూలన దిశగా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందకుండా అరికట్టాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏకన్నగూడెం గ్రామంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఎక్స్‌రే స్క్రీనింగ్ నిర్వహించడంతో పాటు అనుమానితుల నుంచి కఫం (తెమడ) నమూనాలను సేకరించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీలత సమక్షంలో వైద్య సిబ్బంది గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించి, వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మొత్తం 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 22 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, స్క్రీనింగ్ చేపట్టారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి గ్రామాల్లోనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసుకునే అవకాశం ఉంటుందని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రోత్సాహంతో రేగులగూడెం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం.. సర్పంచ్ మోతి వీరస్వామి చొరవే!

- రెండో విడతలో 13 ఇళ్ల మంజూరు.. జిల్లా కాంగ్రెస్ నాయకులు, దేవస్థానం మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య చేతుల మీదుగా భూమిపూజ

కారేపల్లి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్ న్యూస్): వైరా నియోజకవర్గ అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అందిస్తున్న ప్రోత్సాహంతో సింగరేణి మండలం రేగులగూడెం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగుతున్నాయి. ఎమ్మెల్యే సూచనలు, సహకారంతో రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గ్రామ సర్పంచ్ ఈసం మోతి వీరస్వామి శ్రీకారం చుట్టారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్యతో కలిసి లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. రెండో విడతలో రేగులగూడెం గ్రామపంచాయతీకి మొత్తం 13 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. చీమలవారిగూడెంలో లబ్ధిదారులు బర్మావత్ అశ్విని, రఘు దంపతులతో కలిసి కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఈసం మోతి వీరస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రోత్సాహంతో గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందని, రెండో విడతలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈసం రవికుమార్, గ్రామ పెద్దలు, పాలకవర్గ సభ్యులు చెవుల కళావతి, చీమల సర్వయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మధ్యబోయిన కోటయ్య, చెవుల భద్రయ్య, మధ్యబోయిన వెంకట నరసయ్య, బర్మావత్ శరీరం, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజారోగ్యమే ప్రాధాన్యం.. గ్రామ పరిశుభ్రతే లక్ష్యం!

- గాదేపాడులో ప్రతి వారం ఉచిత వైద్య శిబిరాలు.. బీపీ, షుగర్ పరీక్షలు, మందుల పంపిణీకి సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ప్రత్యేక చొరవ



కారేపల్లి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్ -- రాములు): ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా, గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా సింగరేణి మండలం గాదేపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. గ్రామస్థులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా మాణిక్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు మందులు పంపిణీ చేశారు. ప్రతి వారం ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను చేరువ చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి వారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలు, వీధులు, గ్రామ వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యవంతమైన, ఆదర్శ గ్రామ నిర్మాణానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజారోగ్యం, పారిశుధ్యానికి సమ ప్రాధాన్యతనిస్తూ గ్రామస్థులకు నిరంతరం వైద్య సేవలు అందించేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం-1 వాంకుడోత్ కల్పన, ఏఎన్ఎం-2 భూక్య సుజాత, ఆశా కార్యకర్త భూక్య సరోజిని తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు.

చదువుకున్న బడిని మరువని రాజేష్.. విద్యార్థులకు అండగా దాతృత్వపు చేయూత!

- మాదారం ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ.. భూక్య రాజేష్, సంగీత దంపతులకు సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ అభినందనలు





కారేపల్లి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్ -- రాములు): అక్షరాలు నేర్పిన పాఠశాలపై మమకారం.. విద్యాబుద్ధులు నేర్పిన గురువులపై గౌరవం.. తాను చదువుకున్న బడిలోని విద్యార్థుల సంక్షేమానికి తనవంతు సహకారం అందించాలనే సంకల్పంతో భూక్య రాజేష్, సంగీత దంపతులు ఆదర్శంగా నిలిచారు. చదువుకున్న పాఠశాలను మరువకుండా సుమారు 60 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను వితరణగా అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. సింగరేణి మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాదారం గ్రామంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన భూక్య రాజేష్ ప్రస్తుతం సింగరేణి కాలరీస్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తాను విద్యనభ్యసించిన పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, అక్కడ చదువుకుంటున్న చిన్నారులకు ఉపయోగపడేలా తన సతీమణి సంగీతతో కలిసి ఈ కానుకలను అందించారు. గ్రామ సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలను గుర్తుంచుకొని నేటి విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం రాజేష్, సంగీత దంపతులు అందించిన సహకారం ఇతరులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత తాము చదువుకున్న పాఠశాలను, అక్కడ విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులను గుర్తుంచుకొని సహాయం చేయడం గొప్ప విషయమని పలువురు ప్రశంసించారు. ఈ దాతృత్వ కార్యక్రమం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చాగంటి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి విజయ్, గుగులోతు దేవుల అచ్చి, వార్డు సభ్యుడు నర్సింగ్, గుగులోతు వెంకట సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణతోనే సురక్షిత సమాజ నిర్మాణం

- సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, బాల కార్మికత్వంపై విద్యార్థులకు అవగాహన.. సీడీపీవో కె.ఉమా పిలుపు



కారేపల్లి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్ -- రాములు): బాలల భద్రత, హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కె.ఉమా పేర్కొన్నారు. బాలల హక్కులపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో కారేపల్లి మోడల్ స్కూల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఉమా మాట్లాడుతూ నేటి ఆధునిక సాంకేతిక యుగంలో విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను తెరవకూడదని, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇతర రహస్య సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మికత్వం, బాలల అక్రమ రవాణా, చిన్నారులపై లైంగిక వేధింపులు వంటి సామాజిక సమస్యల పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. బాల్యం అనేది పిల్లల ఎదుగుదలకు, విద్యాభ్యాసానికి పునాది అని, ఆ దశలో వారికి రక్షణతో పాటు విద్య, స్వేచ్ఛ, సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాలల హక్కులకు భంగం కలిగినా, చిన్నారులు ఆపదలో ఉన్నా వెంటనే 1098 బాలల సహాయవాణికి సమాచారం అందించాలని సూచించారు. పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం, వారి హక్కులను కాపాడటం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి ఎస్ఐ రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.కృష్ణకుమారి, సత్యశీల, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు టి.విజయకుమారి, ఎస్.బేబీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత సింగరేణి.. నూతన కార్మిక భద్రతా నిబంధనలపై అవగాహన శిబిరం

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్) : సురక్షిత సింగరేణి -- ప్రమాద రహిత సింగరేణి లక్ష్య సాధనలో భాగంగా కార్మికుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కార్మిక భద్రత అలాగే పని పరిస్థితుల కోడ్ -- 2020, కేంద్ర నిబంధనలు -- 2026 పై అవగాహన శిబిరాన్ని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించారు. భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన గనుల భద్రతా సంచాలక కార్యాలయం (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ), దక్షిణ మధ్య మండలం, హైదరాబాద్ ప్రాంతం--1 పర్యవేక్షణలో 2026 కార్యక్రమం గురువారం కొత్తగూడెం ఏరియాలోని ఆర్సీఓఏ క్లబ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గనుల భద్రతా ఉప సంచాలకులు (డీఎంఎస్) ఐ. సత్యనారాయణ, గౌరవ అతిథిగా సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ పాల్గొన్నారు. కార్పొరేట్ జనరల్ మేనేజర్ (సేఫ్టీ) కృష్ణ గోపాల్ తివారీ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఐ. సత్యనారాయణ మాట్లాడుతూ, నూతన కార్మిక భద్రతా నిబంధనలు, వాటి అమలు విధానం, ఉద్యోగుల భద్రత, ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత రక్షణ పరికరాల (పీపీఈ) వినియోగం, గనుల్లో సురక్షిత పని వాతావరణం కల్పించడం వంటి కీలక అంశాలపై వివరించారు. నూతన కార్మిక చట్టాల ప్రకారం పాటించాల్సిన నిబంధనలు, డిజిటల్ విధానంలో రికార్డుల నిర్వహణ, ఉద్యోగులు, యాజమాన్యం బాధ్యతలు, భద్రతా ప్రమాణాల అమలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గనుల్లో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వ్యక్తిగత రక్షణ పరికరాలను సక్రమంగా వినియోగించాలని, సురక్షిత పని విధానాలను అలవర్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. నూతన నిబంధనలపై ఉద్యోగులకు పూర్తి అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి, ఆరోగ్యకరమైన, సురక్షితమైన పని వాతావరణాన్ని ఏర్పాటు చేయవచ్చని పేర్కొన్నారు. సురక్షిత సింగరేణి -- ప్రమాద రహిత సింగరేణి లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఉద్యోగి భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవగాహన శిబిరంలో



కొత్తగూడెం, సత్తుపల్లి, ఎల్లందు, మణుగూరు ఏరియాలతో పాటు కార్పొరేట్ కార్యాలయానికి చెందిన అధికారులు పాల్గొన్నారు. సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకట చారి, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్. వెంకటరమణ, ఏసీఎంఓ ఉషా, గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల ఏజెంట్లు, ప్రాజెక్టు అధికారులు, ఏరియా ఇంజనీర్లు, ఏరియా సేఫ్టీ అధికారులు, గనుల మేనేజర్లు, పర్సనల్, ఐఈడీ అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, మైన్ ఓవర్‌మెన్లు, మైనింగ్ సర్దార్లు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

- గుర్తుతెలియని దుండగుల రక్షణ కొరకు
సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి- ఎస్సై పీట్ల ప్రవీణ్





వైరా, నవంబర్ 19, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ పోలీస్ స్టేషన్లో గురువారం సెల్ ఫోన్ దుకాణాల యజమానులతో వైరా ఎస్సై పీట్ల ప్రవీణ్ సమావేశ నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎస్ఐ పీట్ల ప్రవీణ్ మాట్లాడుతూ గుర్తుతెలియని దుండగులు సెల్ ఫోన్ దుకాణాలను అడ్డాలుగా మార్చుకొని రాత్రిపూట సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి సంఘటనలు ఖమ్మంలో ఇతర ప్రాంతాల్లో పలు సందర్భాల్లో జరిగాయని తెలిపారు. వైరాలో ఇటువంటి సంఘటనలు జరగకుండా నిర్వాహకులు దుకాణాల ముందు రెండు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే అధిక ధరలు కలిగిన సెల్ ఫోన్లు ఉంటే షాపులు బంద్ చేసి ఇంటికి వెళ్లే సమయంలో తీసుకెళ్లాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా సెల్ ఫోన్ అమ్ముతామని వస్తే వారి వద్ద నుండి తప్పనిసరిగా ఆధార్ కార్డు, బిల్లు తీసుకోవాలని, ఎవరైనా అనుమానంగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వైరా ఎస్సై పీట్ల ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎస్సై 2 వెంపటి పవన్, సెల్ఫోన్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

వైరాలో కంచి కరుణమ్మ దశదిన కార్యక్రమం

- నివాళులర్పించిన వైరా పట్టణ పలు పార్టీ నాయకులు, జర్నలిస్టులు



వైరా, నవంబర్ 19, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు లోని నివాసం ఉంటున్న కంచి కరుణమ్మ దశదిన కార్యక్రమం గురువారం వారి స్వగృహంలో బంధు మిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పలు పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పాంజలిని ఘటిస్తూ నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కంచికరణ అమ్మకి నివాళులర్పించిన వారిలో ఆమె కుమారుడు కంచి బెనర్జీ, అల్లుడు మిద్దెల రవి, ఒకటవ వార్డు కౌన్సిలర్ తిరుపతి శ్రీను, బిఆర్ఎస్ నాయకులు గిరిబాబు నాయక్, కట్ట కృష్ణార్జున రావు, కాంగ్రెస్ నాయకులు కట్ల రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, ఎస్కే లాల్ మహ్మద్, సిపిఎం నాయకులు బొంతు రాంబాబు, ప్రసాద్, ఈ యన్. డి రమేష్, వైరా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఎక్కిరాల శ్రీనివాసరావు, సూతగాని ప్రేమ్ చంద్, హెచ్ఎంటీవీ రఫీ, శేఖర్, పులి కృష్ణార్జున్, విజయ్, మోదుగు గోవిందరావు తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.



యంగ్ లీడర్స్ డైలాగ్ పోటీల్లో నలుగురు విజేతలు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్) : యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి, దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2027 స్టేజ్-2 జిల్లా స్థాయి పోటీలు గురువారం కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. యువజన సర్వీసుల కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీల్లో అక్టోబర్ నెలలో జరిగిన ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొని స్టేజ్-2కు అర్హత సాధించిన అభ్యర్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సంధ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. వనజ, పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నియాజ్ పర్వీన్ షేక్ వ్యవహరించారు. పోటీల్లో పినపాకకు చెందిన ఎం. శశి వర్ధన్ మొదటి స్థానం సాధించగా, భద్రాచలానికి చెందిన టి. సంగీత రెండో స్థానం, ఇల్లందుకు చెందిన జె. దీపిక మూడో స్థానం, ఇల్లందుకే చెందిన డి. సాయి ప్రియ నాలుగో స్థానం సాధించారు. ఈ నలుగురు విజేతలు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికయ్యారని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. అనూష తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆమె అభినందనలు తెలియజేశారు.

క్రీడా స్ఫూర్తితో సత్తా చాటాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి
జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలి

- కొత్తగూడెం నగర మేయర్ మూడు గణేష్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్) : చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే విద్యార్థులకు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని కొత్తగూడెం నగర మేయర్ మూడు గణేష్ అన్నారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో గురువారం నిర్వహించిన అండర్-14, 17 బాల, బాలికల జిల్లా స్థాయి 70వ పాఠశాలల క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేసి, క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు.అనంతరం మేయర్ మాట్లాడుతూ.. క్రీడా మైదానంలో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం అందిస్తే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ రోజూ కొంత సమయం మైదానంలో గడపాలని హితవు పలికారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకట్ట వేయకపోతే సింగరేణి కాలనీల్లో పచ్చదనం కనుమరుగు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్) : ఒకప్పుడు పచ్చదనానికి సింగరేణి కాలనీలు చిరునామాగా ఉండేవి. గతంలో అధికారులు కార్మికుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో కాలనీల్లో ఎక్కడ చూసినా పచ్చని చెట్లు దర్శనమిచ్చేవి. క్వార్టర్ల సంఖ్య కంటే చెట్ల సంఖ్యే ఎక్కువగా ఉండేదంటే పచ్చదనం ఏ స్థాయిలో ఉండేదో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇటీవల కాలంలో కొందరు వాస్తు పేరుతో, మరికొందరు కోతుల బెడదను కారణంగా చూపుతూ చెట్లను తొలగిస్తున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు మహా వృక్షాలుగా ఎదిగి పండ్లను అందిస్తున్నప్పటికీ వాటిని విచక్షణారహితంగా నరికివేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ప్రాంతంలో చెట్ల నరికివేత యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇటీవల రుద్రంపూర్ ప్రాంతంలోని ఎన్,సి,ఎన్‌బి క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన నేపథ్యంలో, క్వార్టర్లు తీసుకున్న కొందరు అక్కడ గత కొన్నేళ్లుగా పెరిగిన చెట్లను తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సింగరేణి పర్సనల్ విభాగం, ఎస్ అండ్ పీసీ సిబ్బంది స్పందించాల్సిన అవసరం ఉంది. క్వార్టర్ల కౌన్సెలింగ్ సమయంలోనే ఎలాంటి, సరైన కారణం లేకుండా చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత వ్యక్తులను హెచ్చరించాలి. అనుమతి లేకుండా చెట్లను తొలగించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. ఇలాగే ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు చెట్లను నరికివేస్తూ పోతే భవిష్యత్‌లో కాలనీల్లో పచ్చదనం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. దీని ప్రభావం పర్యావరణంపై పడటమే కాకుండా భావితరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి కాలనీల్లో పచ్చదనాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కార్మికులు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

సింగరేణి దీక్షలు.. డిపెండెంట్లకు ఉద్యోగాలివ్వాలి

- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిమాండ్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్) : సింగరేణి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర నాయకులు వంగ వెంకట్ మాట్లాడుతూ మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు జీతభత్యాలు చెల్లించకుండా ఖాళీగా ఉంచడం అన్యాయమని అన్నారు. మెడికల్ ఫిట్ అయిన రోజు నుంచే జీతభత్యాలు చెల్లించాలని, లేదంటే తక్షణమే ఉద్యోగ నియామక పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఇన్వాలిడేషన్ అయిన వెంటనే టెర్మినల్ బెనిఫిట్స్ అందక, వారి వారసులకు ఉద్యోగాలు రాక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. సుమారు 200 మంది డిపెండెంట్లు మెడికల్ ఫిట్ అయినప్పటికీ ఉద్యోగ నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మెడికల్ బోర్డుల పేరుతో కాలయాపన చేయకుండా గతంలో మాదిరిగా 100 శాతం ఇన్వాలిడేషన్ విధానాన్ని అమలు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. అదేవిధంగా టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఏఐటీయూసీ నాయకులు సింగరేణి ప్రధాన కార్యాలయంలో డీజీఎం (పర్సనల్) రాజగోపాల్‌ను కలిసి కార్మికుల సమస్యలు, పెండింగ్ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ముఖ్య సలహాదారు శేషయ్య, కేంద్ర ప్రచార కార్యదర్శి జి. వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, కత్తెర్ల రాములు, సహాయ కార్యదర్శి రాము, ఇతర యూనియన్ నాయకులు, పిట్ కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

రామాంజనేయ కాలనీలో.. పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు గురువారం తెల్లవారుజామున చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాంజనేయ కాలనీలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 100 ఇళ్లను తనిఖీ చేయగా, 54 ద్విచక్ర వాహనాలు, 08 ఆటోలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 45 వాహనాలపై జరిమానాలు విధించగా, 15 వాహనాలకు సంబంధించి జరిమానాలు వసూలు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 11 వాహనాలను పోలీస్ స్టేషన్‌లో అదుపులో ఉంచారు. అదేవిధంగా అక్రమ మద్యం కు సంబంధించి 04 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ కాలనీ వాసులతో సమావేశమై మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువతపై వాటి ప్రభావం గురించి వివరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అలాగే మంత్రాలు, చేతబడి వంటి మూఢనమ్మకాలను నమ్మి మోసపోవద్దని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని అవగాహన కల్పించారు. రహదారి భద్రతలో భాగంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాలనీలోని ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు,



ప్రజల భద్రతకు దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు లక్ష్మి, వెంకటేశ్వర్లు, యాసీన్, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

గురు హరిహర మందిరంలో నేటి నుంచి కార్తీక ఏకాదశి ఉత్సవాలు



కామేపల్లి, నవంబర్19 (భద్రాద్రిన్యూస్): కామేపల్లిలోని శ్రీ గురు హరిహర మందిరంలో గురువారం నుంచి కార్తీక ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు భక్త మండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ తెలిపారు.ఈ సందర్భంగా మందిరంలో శివునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే సంప్రదాయం ప్రకారం గురువారం శివనామ ఏకాహం, శుక్రవారం హరే రామ నామ సంకీర్తన ఏకాహం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ హనుమాన్ చాలీసా పారాయణం, నగర సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని శివాజీ విజ్ఞప్తి చేశారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
శుక్రవారం
20 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

బీటీపీఎస్ కార్మికుల సీనియార్టీ జాబితాను వచ్చే నెలలో ప్రకటిస్తాం!

- కార్మిక సమస్యల పరిష్కారానికి సీఈ బి. బిచ్చన్న హామీ..
టీఎస్పిఈయు -1535 నాయకుల వినతిపత్రం



పాల్వంచ, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్): భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో పనిచేస్తున్న కార్మికుల సీనియార్టీ జాబితాను వెంటనే ప్రకటించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్పిఈయు)-1535 నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మణుగూరులోని బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ బి. బిచ్చన్నను యూనియన్ ప్రాంతీయ నాయకులు కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాంతీయ అధ్యక్షుడు వి. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్. రామచందర్, జెన్కో జాయింట్ సెక్రటరీ సిద్ధులు హుస్సేన్ మాట్లాడుతూ బీటీపీఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను చీఫ్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లారు.

వారి ప్రధాన డిమాండ్లు ఇవే..

- సీనియార్టీ జాబితా విడుదల: బీటీపీఎస్‌లో పనిచేస్తున్న కార్మికుల సీనియార్టీ జాబితాను వెంటనే ప్రకటించాలి.
- కోల్, డస్ట్ అలవెన్సులు: ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కోల్, డస్ట్ అలవెన్సులను తక్షణమే మంజూరు చేయాలి.
- జేపీఏలుగా కన్వర్షన్: భూనిర్వాసిత కోటాలో నియమితులై ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఆఫీస్ సబర్డినేట్లు, హౌస్ కీపర్లను జూనియర్ ప్లాంట్ అటెండెంట్లుగా (జేపీఏ) మార్చేందుకు డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) నిర్వహించాలి.
- డ్రైవర్ పోస్టుల భర్తీ: ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభమై ఆరేళ్లు పూర్తవుతున్నప్పటికీ డ్రైవర్ పోస్టులు మంజూరు చేయకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్లాంట్ అవసరాలకు అనుగుణంగా డ్రైవర్లు, డోజర్ ఆపరేటర్లు, క్రేన్ ఆపరేటర్లను వెంటనే నియమించాలి.
- ఆస్పత్రిలో ఆధునిక వైద్య సౌకర్యాలు: బీటీపీఎస్ టౌన్‌షిప్‌లో నిర్మిస్తున్న ఆస్పత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులో ఉంచాలి.

సీఈ సానుకూల స్పందన.. వచ్చే నెల చివరి నాటికి జాబితా

యూనియన్ నాయకులు వివరించిన సమస్యలపై చీఫ్ ఇంజనీర్ బి. బిచ్చన్న సానుకూలంగా స్పందించారు. విద్యుత్ సౌధలోని ఉన్నతాధికారులు డైరెక్టర్ (హెచ్ఆర్) కుమార్ రాజు, సీజీఎం రాజేంద్రప్రసాద్, ఫైనాన్షియల్ అడ్వైజర్ సత్యరాజులతో మాట్లాడిన అనంతరం కార్మికుల సీనియార్టీ జాబితాను వచ్చే నెల చివరి నాటికి ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆఫీస్ సబర్డినేట్లు, హౌస్ కీపర్లకు త్వరలోనే డీపీసీ నిర్వహించి జేపీఏలుగా కన్వర్షన్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ (అడ్మినిస్ట్రేషన్) వి. మురళీకృష్ణతో పాటు యూనియన్ నాయకులు కే. వీరబాబు, బి. నరసింహారావు, సిహెచ్. వెంకటరమణ, జి. రవికుమార్, ఎస్.కే. సలీం పాషా, తిరుపాల్ రెడ్డి, కళ్యాణి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మందరికలపాడులో 26 ఇంకుడు గుంతల పనులు ప్రారంభం

- అంగన్‌వాడీ కేంద్రం, మిషన్ భగీరథ పంప్‌హౌస్ పరిశీలించిన ఎంపీడీవో, ఎంపీఓ

పాల్వంచ, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):
పాల్వంచ మండలంలోని మందరికలపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఎంపీడీవో పి. రాజారావు, మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) షేక్ షబ్నా గురువారం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ తీరు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సేవలను పరిశీలించారు. అనంతరం మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను సందర్శించి గ్రామానికి తాగునీటి సరఫరా జరుగుతున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

భూగర్భ జలాల పెంపునకు 26 ఇంకుడు గుంతలు

గ్రామంలో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా, భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణాన్ని మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం గ్రామంలో 26 ఇంకుడు





గుంతల నిర్మాణ పనులను ఎంపీడీవో, ఎంపీఓ ప్రారంభించారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంచుకోవచ్చని, నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై సమీక్ష

అనంతరం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం మొదటి విడతలో ఎంపికైన గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకం అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడం, క్షేత్రస్థాయిలో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు తగిన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో మందరికలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భానులక్ష్మి, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కే టి పి ఎస్ లో అధికార పరిధి వివాదం..

- సమయపాలన, డ్రెస్ కోడ్ అమలుపై ప్రశ్నలు!
- ఎస్ ఏ ఓ -1,2 బాధ్యతలపై ఉద్యోగుల్లో సందేహాలు..
సెక్యూరిటీ గేటు వద్ద వాగ్వాదాల ఆరోపణలు
- విజిలెన్స్ విచారణకు పలువురి డిమాండ్..
డివైసిసి పాత్రపైనా చర్చ



పాల్వంచ, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):
పాల్వంచ కేటీపీఎస్‌లోని అకౌంట్స్ విభాగంలో ఎస్ ఏ ఓ-1,2 అధికారుల విధుల కేటాయింపు, అధికార పరిధి, సీనియారిటీ, పరిపాలనా వ్యవహారాలపై ఉద్యోగుల్లో అసంతృప్తి, పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమోషన్ ద్వారా వచ్చిన సీనియర్ ఎస్ ఏ ఓ-2 అధికారి ఉండగా, ప్రమోషన్ లేకుండా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్ ఏ ఓ-1 అధికారికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోస్టింగ్‌లు, విధుల కేటాయింపులు ఏ నిబంధనల ప్రకారం జరుగుతున్నాయి? సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశాల్లో అనుసరిస్తున్న విధానమేమిటి? అనే ప్రశ్నలు ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై హైదరాబాద్‌లోని జెన్కో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, అధికారుల బాధ్యతలు, అధికార పరిధిపై స్పష్టత ఇవ్వాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. అదేవిధంగా డివైసిసి స్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలు ఇతర అధికారుల వద్దకు వెళ్లడం, పరిపాలనా వ్యవహారాల్లో స్పష్టత కొరవడటం వంటి అంశాలపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సెక్యూరిటీ గేటు వద్ద సమయపాలనపై వాగ్వాదాలు?

కేటీపీఎస్ సెంట్రల్ ఆఫీస్ గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది, ఆలస్యంగా విధులకు హాజరవుతున్న ఓ అండ్ ఎం కార్మికులను ప్రశ్నించిన సందర్భాల్లో కొందరు వాహనాలను ఆపకుండా వెళ్లిపోతున్నారని, మరికొందరు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదాలకు దిగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధుల్లో భాగంగా సమయపాలనను ప్రశ్నించే సిబ్బందిపై ఒత్తిడి, బెదిరింపులు ఎదురవుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

డ్రెస్ కోడ్, బయోమెట్రిక్ హాజరు అమలులో ఒకే విధానం ఉందా?

మరోవైపు ఓ అండ్ ఎం కార్మికుల సమయపాలన, డ్రెస్ కోడ్, బయోమెట్రిక్ హాజరు అమలుపై కూడా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో అమలవుతున్న నిబంధనలు సెంట్రల్ ఆఫీస్‌లోనూ ఒకే విధంగా అమలవుతున్నాయా? ఆలస్యంగా విధులకు హాజరవుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారా? డ్రెస్ కోడ్ పాటించని వారిని ప్రశ్నించినప్పుడు యూనియన్ నాయకులు లేదా ఉన్నతాధికారుల జోక్యం ఉంటుందనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఒకే స్థానంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న అధికారులపై సమీక్ష అవసరం

కేటీపీఎస్‌లో ఏళ్ల తరబడి ఒకే స్థానంలో కొనసాగుతున్న అధికారుల బదిలీలు, విధుల నిర్వహణ, పరిపాలనా వ్యవహారాలపై కూడా సమీక్ష జరపాలని ఉద్యోగులు కోరుతున్నారు. గతంలోనూ ఈ అంశాలపై కథనాలు వెలువడినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన స్పందన కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు, పాలనా వ్యవస్థల్లో మార్పులు వచ్చినా విద్యుత్ సంస్థల్లో కొందరు అధికారులు ఒకే స్థానంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న తీరు సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. అకౌంట్స్ విభాగంలో ఎస్ ఏ ఓ-1,-2 అధికారుల బాధ్యతలు, సీనియారిటీ, విధుల కేటాయింపు, డివైసిసి పాత్ర, సమయపాలన, డ్రెస్ కోడ్, సెక్యూరిటీ సిబ్బందిపై ఒత్తిళ్ల ఆరోపణలు తదితర అంశాలపై జెన్కో యాజమాన్యం, విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారుల స్పందనతో పాటు నిబంధనల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. పత్రికలో ప్రచురించే ముందు సంబంధిత అధికారుల స్పందనను తీసుకుని చేర్చడం మంచిది. వ్యక్తులపై నిర్ధారణ కాని ఆరోపణలను వార్తలో ఆరోపణలుగానే పేర్కొనడం బాధ్యతాయుతమైన జర్నలిజానికి అవసరం.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్, గ్రౌండ్ ఫోకస్ లైట్లు అందజేత



- **యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి**
- **వడ్డే శ్రీనివాసులు**

కొత్తకోట,నవంబర్19 : యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామ యువకులను క్రీడల్లో ప్రోత్సహించే ఉద్దేశంతో తన మనవడు విశ్వ దేవజ్ఞ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామ క్రీడాకారులకు వాలీబాల్ కిట్‌తో పాటు గ్రౌండ్ ఫోకస్ లైట్లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, ఐకమత్యాన్ని అలవర్చుతాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని యువకులకు పిలుపునిచ్చారు.అలాగే ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను ప్రేమించాలని, గురువులను గౌరవించాలని, అప్పుడే జీవితంలో ఏ రంగంలోనైనా విజయం సాధించగలరని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో సాధన చేసి గెలుపు దిశగా అడుగులు వేయాలని సూచించారు. గ్రామ యువత క్రీడల్లో ముందుకు సాగేందుకు తన వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భర్త సాయిలు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు హోటల్ రాజు, సీనియర్ నాయకులు రవీందర్ గౌడ్, ధనుష్, డీకే లక్ష్మణ్ పాల్గొన్నారు.

వాయు కాలుష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి



- **భూపేందర్ యాదవ్**
- **ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో కాలుష్య నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ**

న్యూఢిల్లీ, నవంబర్ 19 :ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలను మరింత కఠినతరం చేయాలని నిర్ణయించింది. కాలుష్య నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఏమాత్రం ఉపేక్ష చూపకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలుష్యానికి కారణమయ్యే కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని, నిబంధనలు పాటించని వ్యక్తులు, సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని స్థానిక సంస్థలు, మున్సిపల్ విభాగాలు కాలుష్య నియంత్రణ చర్యలను సమర్థంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. రహదారులు, బహిరంగ ప్రదేశాలు, నిర్మాణ ప్రాంతాలు సహా కాలుష్యానికి దారితీసే అంశాలపై సంబంధిత సంస్థలు నిరంతరం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణకు తీసుకునే చర్యలు కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినమైన జరిమానాలు, ఇతర శిక్షాత్మక చర్యలు తీసుకోవాలని భూపేందర్ యాదవ్ స్పష్టం చేశారు. కాలుష్యానికి కారణమవుతున్న వారిని గుర్తించి బాధ్యత వహించేలా చేయాలని సూచించారు. ఉల్లంఘనలపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణ విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరించాలని స్థానిక సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.వార్డుల స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారుల పనితీరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్రతి వార్డులో కాలుష్య నియంత్రణకు చేపట్టిన చర్యలు, వాటి అమలు తీరు, ఎదురవుతున్న సమస్యలపై నిరంతరం సమీక్ష జరగాలని తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించి, వాటి అమలుపై జవాబుదారీతనం ఉండేలా చూడాలని ఆదేశించారు.రోజువారీ పర్యవేక్షణ ద్వారా లోపాలను వెంటనే గుర్తించి సరిదిద్దే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ చర్యలను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడంపై స్థానిక సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలని భూపేందర్ యాదవ్ కోరారు. ప్రతి చర్యకు గడువు నిర్ణయించి, ఆ మేరకు పురోగతిని సమీక్షించాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయం పెంచడంతో పాటు అమలులో నిర్లక్ష్యం వహించే వారిపై బాధ్యతను నిర్ధారించాలని తెలిపారు. కాలుష్య నియంత్రణకు సంబంధించిన నిర్ణయాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని స్పష్టం చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యం, సాధారణ జీవనంపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. స్థానిక సంస్థలు, సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేయాల్సి ఉంది. నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు, వార్డుల వారీగా రోజువారీ పర్యవేక్షణ, అధికారుల జవాబుదారీతనం, నిర్దిష్ట గడువుల్లో చర్యల అమలు వంటి అంశాలపై కేంద్రం దృష్టి సారించింది.